ప్రజాశక్తి
మంగళవారం 13 జూన్ 2023 5
పార్వతీపురం మన్యం

## జగనన్నకు చెబుదాంకు 76 అర్జీలు

ప్రజాశక్తి - కలెక్టరేట్

కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం ఏర్పాటు చేసిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో కలెక్టర్ నిశాంత్ కుమార్ జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు, ఐటిడిఎ, ప్రాజెక్ట్ అధికారి సి.విష్ణు చరణ్‌తో కలిసి ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజలు పలు సామాజిక, వ్యక్తిగత అంశాలపై 76 అర్జీలు అందజేశారు. అర్జీలను పరిశీలించి తక్షణమే చర్యలు తీసుకోవాలని, బాధితులకు న్యాయం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. డ్వామా, డిఆర్‌డిఎ పిడీలు కె.రామచంద్ర రావు, పి.కిరణ్ కుమార్, ఆర్.డబ్ల్యు.ఎస్ ఇఇ ఓ. ప్రభాకర రావు, సివిల్ సప్లయ్ జిల్లా మేనేజర్ ఎం.డి.నాయక్, డిపిఒ బి.సత్యనారాయణ, డిఎంహెచ్ఒ జిల్లా వైద్య బి. జగన్నాథరావు, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ముందుస్తుగానే సాగునీరు

- ఉపాధిహామీ నిధులతో కాలువ పనులు
- తోటపల్లి నీరు విడుదల చేసిన జెడ్‌పి చైర్మన్

ప్రజాశక్తి - గరుగుబిల్లి

ఖరీఫ్‌ను దృష్టిలో పెట్టుకొని వ్యవసాయ పనులకు నెల రోజులు ముందుగానే రైతులకు సాగు నీరు విడుదల చేస్తున్నట్టు జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని సర్దార్ గౌతులచ్చన్న తోటపల్లి ప్రాజెక్టు కుడి ప్రధాన కాలువ నుంచి సాగునీరు విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌ను దృష్టిలో పెట్టుకొని స్థానిక ప్రజాప్రతినిధుల అభ్యర్థుల మేరకు, ఇరిగేషన్ అధికారుల సూచన మేరకు సాగునీటిని ముందుస్తుగానే విడుదల చేస్తున్నామన్నారు. అలాగే ఉపాధి హామీ నిధులతో కాలువల పనులు చేపట్టామన్నారు. మెయిన్ కాలువ ద్వారా పాలకొండ వైపు నీరు అందించే విషయంలో అధికారులు చర్యలు చేపట్టడం అభినందనీయమన్నారు. రైతులకు సకాలంలో సాగు నీరు అందించే విషయంలో వెనుకడుగు వేసేదేలేదన్నారు. ఉమ్మడి విజయనగరం జిల్లాలోని 34 మండలాల్లోని రైతులు పుష్కలంగా పంటలు పండించుకోవచ్చన్నారు. రూ.120 కోట్లు కొత్త ఆయకట్టు పనులకు నిధులు మంజూరు చేశామన్నారు. చిన్న, చిన్న పనులు పెండింగులో ఉన్నా నీరు విడుదల చేయడం రైతులకు ఏంతో మంచిదని తెలిపారు. కార్యక్రమంలో బొబ్బిలి, కురుపాం, పార్వతీపురం ఎమ్మెల్యేలు శంబంగి వెంకటచినప్పలనాయుడు, పి.పుష్పశ్రీవాణి, ఎ.జోగారావు, జెడ్పీ వైస్ చైర్మన్ బాపూజీ నాయుడు, ఎంపిపి ఉరిటీ రామారావు, ఉల్లిభద్ర ఎంపిటిసి బి.గౌరమ్మ, సిఇ సుగుణాకర్ రావు, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

**మల్లివీడు వద్ద ఎడమ ప్రధాన కాలువకు గండిని పుడ్చాలి**

**పాలకొండ రూరల్:** తోటపల్లి బ్యారేజ్ నుంచి తక్షణమే నీరు విడుదల చేసి ఖరీఫ్ సీజన్లో సాగు నీటి సమస్య రాకుండా ముందస్తుగా చర్యలు చేపట్టాలని రైతు సంఘం నాయకులు పులిబిల్లి అప్పలనాయుడు, రైతులు కోరారు. ఈ మేరకు వారు సోమవారం తోటపల్లి ఎడమ ప్రధాన కాలువను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆయకట్టు పరిధిలో గల చెరువులను నింపాలని, అనేక చోట్ల కాలువల గట్లు బలహీనంగా ఉన్నాయని, గత ఖరీఫ్ సీజన్లో వర్షాలు కారణంగా నీటి ప్రవాహం పెరిగి అనేక ,ఓట్ల కాలువకు గండ్లు పడ్డాయని తెలిపారు. అలాగే మల్లివీడు వద్ద కాలువ దిగువ నుంచి వెళ్లే చిట్టిగెడ్డకు భారీ గండిపడిందని, గత ఖరీఫ్ చివరి దశలో ఉండడం వల్ల పంటకు ఎటువంటి సమస్య తలెత్తలేదని గుర్తు చేశారు. అదే పరిస్థితి లుంబూరు సమీపంలో ఓనిగెడ్డ పక్కనే భారీ గండి పడిందని, దీనివల్ల లుంబురు, పాలకొండ గ్రామాల రైతులకు చెందిన సుమారు 500 ఎకరాలకు సాగునీరు ప్రశ్నార్థకమయ్యే పరిస్థితి ఉందని, తక్షణమే పై గండ్లను పూడ్చి సాగునీరుకు ఎటువంటి ఆటంకాలు లేకుండా చూడాలని నీటిపారుదల శాఖ అధికారులను కోరారు. ప్రభుత్వం సాగునీటి కాలువల మరమ్మతులకు కావాల్సిన నిధులు మంజూరు చేయకపోవడంతో అనేక సమస్యలున్నా అధికారులు ఏమీ చేయలేని పరిస్థితి ఎదురవుతుందని అన్నారు. దీని ప్రభావం పంటలపై పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే తగు చర్యలు తీసుకోకపోతే ఆందోళన తప్పదన్నారు. వీరి వెంట రైతులు పాలవలస రామినాయుడు, గౌరీ శంకర్రావు, వారాడ గణపతిరావు, పత్తిగుల్ల దాల అప్పారావు ఉన్నారు.

ఎడమ ప్రధాన కాలువ ద్వారా సాగునీరు విడుదల చేస్తున్న జెడ్‌పి చైర్మన్ శ్రీనివాసరవు, ఎమ్మెల్యేలు

# బాల కార్మిక వ్యవస్థను నిర్మూలిద్దాం

## జిల్లా జూనియర్ సివిల్ జడ్జి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇన్‌ఛార్జ్ ఎ.రమేష్ అన్నారు. ప్రపంచ బాలకార్మికుల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సోమవారం స్థానిక జిల్లా కోర్టు వద్ద జరిగిన ప్రత్యేక ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ ర్యాలీని ఉద్దేశించి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి రమేష్ మాట్లడుతూ పేదరికం, తల్లిదండ్రులు లేకపోవడం, తల్లిదండ్రుల దురలవాట్ల వల్ల పిల్లలు బాలకార్మికులుగా తయారవుతున్నారని, వెట్టిచాకిరీకి గురవుతున్నారని అన్నారు. నేటి బాలురే రేపటి పౌరులని, వారిని ఎంత బాగా కాపాడుకుంటే దేశ భవష్యత్తును అంత కాపాడుకొనే అవకాశం ఉందని చెప్పారు. పిల్లలను ఎవరైతే బాలకార్మికులుగా చేస్తున్నారో వారు అవగాహన పొందాలని పేర్కొన్నారు. బాలలను కార్మికులుగా మార్చితే వారిపై చర్యలు తీసుకొనేందుకు అనేక చట్టాలు ఉన్నాయనిచెప్పారు. బాలలు బాల్యాన్ని ఆనందంగా అనుభవించాలని, బడిలో గడపాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమములో జిల్లా సహాయ లేబర్ కమిషనర్ కె.రామకృష్ణా రావు, జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ సభ్యులు డా.టి.జగన్మోహన రావు, పోలీస్, సాంఘిక సంక్షేమ శాఖ, విద్యా శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

**సీతంపేట:** అంతర్జాతీయ బాల కార్మిక వ్యవస్థ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మండలంలోని వజ్జాయిగూడ, కోడిశలో, పాలకొండ పట్టణ ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో జన చేతన సంస్థ నిర్వహించిన చైతన్య కార్యక్రమంలో ఎపి ప్రో చైల్డ్ గ్రూప్ - క్రాఫ్ వారు రూపొందించిన "బాల కార్మిక వ్యతిరేక మాసంగోడ పత్రికను ఆవిష్కరించడం జరిగింది. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి బగాది శశి భూషణ చౌదరి, ఉపాధ్యాయులు, అంగన్వాడీ కార్యకర్త, మహిళా పోలీస్, సచివాలయం సిబ్బంది, జనచేతన కో-ఆర్డినేటర్ ఎం.సరస్వతి, పలువురు పిల్లలు, తల్లిదండ్రులు, యువత తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీని ప్రారంభిస్తున్న ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి రమేష్

## పులి దాడిలో రెండు ఆవులు మృతి

ప్రజాశక్తి - మక్కువ

మండలం లోని కొండరాజేరు గ్రామ సమీపంలో పులి దాడిలో రెండు ఆవులు మృతి చెందాయి. గొల్లపల్లి రవికి చెందిన ఆవులపై కొండ సమీపంలో ఉన్న తుమ్మగెడ్డలో పులి దాడి చేసి చంపినట్టు స్థానికులు గుర్తించార. పార్వతీపురం బీటుకు సంబంధించిందని అసలు పులి జాడలే కావని. పెద్ద నక్క అడుగులని ఫారెస్ట్ అధికారులు తొలుత విలేకరులకు తెలపడం వారి నిర్లక్ష్యాన్ని తెలియజేస్తుంది. అటవీ సిబ్బంది నిర్లక్ష్యం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అటవీశాఖ అధికారులు స్పందించి పులి జాడలపై ప్రజలను అప్రమత్తం చేయాల్సిన అసవరం ఎంతైనా ఉంది.

విద్యార్థులకు కిట్లును అందజేస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

## విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అన్నారు. పట్టణంలోని బెలగాంలో గల ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థినులకు జగనన్న విద్యా కానుక కిట్లను సోమవారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థినులు కఠోర దీక్ష, నిరంతర సాధనను అలవర్చుకుని చదివితే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని అన్నారు. విద్యా వ్యవస్థలో సమూల మార్పులను తీసుకువచ్చారని పేర్కొన్నారు. పాఠశాలలు తెరుచుకునే నాటికి నాణ్యమైన బ్యాగులు, యూనిఫాం, షూస్, బెల్ట్, పాఠ్య పుస్తకాలతో సహా డిక్షనరీ ప్రభుత్వం పంపిణీ చేస్తుందన్నారు. ఈ అవకాశాన్ని అందిపుచ్చుకొని ప్రణాళికా బద్ధంగా చదివి ఉన్నత విద్యను అభ్యసించాలని ఆకాంక్షించారు. విద్యార్థినులు డిక్షనరీలు వినియోగించి ఆంగ్ల పదాలపై పట్టు సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ సూచించారు. అనంతరం ఆయన చేతుల మీదుగా జగనన్న విద్యా కానుక కిట్లను విద్యార్థినులకు పంపిణీ చేశారు. జిల్లాలో 96,682 మంది విద్యార్థులకు జగనన్న విద్యా కిట్లు పంపిణీ చేయడం జరుగుతుంది. కార్యక్రమంలో డిఇఒ ఎన్.ప్రేమ్ కుమార్, ఎంఇఒ పివి ప్రసాద్, ఉపాధ్యాయులు ఆర్.శివన్నారాయణ, బి.వాసుదేవరావు, డి.పార్వతీ, గౌరీ, మంజుల, తదితరులు పాల్గొన్నారు.

## వరి విత్తనాలు పంపిణీకి సిద్ధం

**మక్కువ :** మండలంలోని ఖరీఫ్ నాటికి 1600 క్వింటాళ్ల వరి విత్తనాలను సిద్ధం చేసినట్లు వ్యవసాయ సలహా మండల చైర్మన్ మావుడి రంగునాయుడు అన్నారు. మండలంలోని కాశీపట్నం రైతు భరోసా కేంద్రంలో రైతులకు విత్తనాలను సోమవారం అందజేశారు. సాధారణ రైతులకు వరి విత్తనం కిలో రూ.10 చొప్పున బస్తా రూ.300 రాయితీపై ఇస్తుమన్నారు. గిరిజన రైతులకు 90శాతం రాయితీపై వరి విత్తనాలను రాష్ట్ర ప్రభుత్వము అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ రావు ఇతర సిబ్బంది పాల్గొన్నారు .

## ఎంఇఓ నిర్లక్ష్యం

### విద్యార్థులకు అందని జగనన్న విద్యా కానుకలు

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా సోమవారం ప్రారంభించిన జగనన్న విద్యా కానుకలు మండల విద్యా అధికారి నిర్లక్ష్యం కారణంగా మండలంలోని పలు పాఠశాలల విద్యార్థులకు పంపిణీ చేయలేదు. మండలంలోని పెదబొండపల్లి, బందలుప్పి స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని పాఠశాలలకు జెవివికె కిట్లు అందకపోవడంతో ఈ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర అసంతృప్తి, ఆగ్రహావేశాలు ఉపాధ్యాయ సిబ్బందిపై వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈమేరకు ఈనెల 11 నాటికి ప్రతి పాఠశాలకు నేరుగా జెవివి కిట్లు మండల విద్యాశాఖ అధికారులు అందించాలి. కానీ స్థానిక ఎంఇఒ నిర్వాహకం వల్ల సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉపాధ్యాయులు ఎదురుచూసినా పుస్తకాలు జెవివికె కిట్లు అందచేయలేదు. ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఈ కార్యక్రమంలో పాఠశాల తెరిచే నాటికి విద్యార్థులకు ఈ కిట్లు అందజేయాలని ఉన్నతాధికారులు ఆదేశించినా స్థానిక ఎంఇఒ వారి ఆదేశాలను బేఖాతరు చేశారు. ఇదే అంశంపై గతంలో విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులపై చర్యలు తీసుకున్నారు. పాఠశాలలకు ఇంకా పుస్తకాల అందలేదని మండల విద్యాశాఖ అధికారికి ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోలేదు. ఇప్పటికైనా కలెక్టర్, డిఇఒ వెంటనే స్పందించి విద్యార్థులకు జెవివికె కిట్లు అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అలాగే మండలంలోని అన్ని పాఠశాలలకు జెవివికె కిట్ల పంపిణీ జరిగిందని అధికారులను తప్పుదోవ పట్టించిన ఎంఇఒపై చర్యలు తీసుకోవాలని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ మురళీమోహన్ రావు డిమాండ్ చేశారు.

## 15న మొబైల్ టవర్లు ప్రారంభం

ప్రజాశక్తి - కలెక్టరేట్

ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఈనెల 15న వర్చువల్‌గా మొబైల్ టవర్లను ప్రారంభించనున్నట్లు జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు. జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో అధికారులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమాన్ని పాచిపెంట మండలంలో నిర్వహించనున్నట్టు తెలిపారు. ఏర్పాట్లను పర్యవేక్షించాలని పార్వతీపురం ఐటిడిఎ పిఒ, డిఆర్‌డిఎ పీడీలను ఆదేశించారు. గృహనిర్మాణం, రోడ్డు పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని చెప్పారు. అన్ని ప్రాధాన్య పనులపై దష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆర్ గోవిందరావు, పార్వతీపురం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సి.విష్ణు చరణ్, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ రైతు పురస్కారాన్ని అందుకుంటున్న శ్రీరాములు

## మంచిపల్లికి ఉత్తమ రైతు పురస్కారం

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వారి స్థాపన దినోత్సవం సందర్భంగా సోమవారం గుంటూరులో జరిగిన కార్యక్రమంలో జిల్లాకు డాక్టర్ మంచిపల్లి శ్రీరాములుకు ఉత్తమ రైతు పురస్కారాన్ని విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య విష్ణువర్ధన్‌రెడ్డి, డాక్టర్ త్రిలోచన్ మహాపాత్రో, మాజీ డైరెక్టర్ జనరల్ ఐసిఎఆర్ చేతుల మీదుగా ప్రదానం చేశారు. ఈ పురస్కారానికి గానూ వీరికి రూ.25వేలు నగదు ప్రశంసా పత్రం, జ్ఞాపికతో సత్కరించారు. శ్రీరాములు గరుగుబిల్లి మండలంలో గల తోటపల్లి తన వ్యవసాయ క్షేత్రం ప్రకతి ఆరామం, ప్రకతి క్షేత్రంలో నూతన ఒరవడులు, ఆవిష్కరణలు, అన్నపూర్ణ వ్యవసాయ విధానంలో నూతన ఒరవడులకు గానూ ఈ పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ మేరకు శ్రీరాములును యాదవ సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు, జట్టు వ్యవస్థాపకులు డాక్టర్ డి పారినాయుడు అభినందించారు.

## ప్రాధాన్యతా పనులు పూర్తి కావాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

ప్రాధాన్యతా పనులు పూర్తి కావాలని పార్వతీపురం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సి. విష్ణు చరణ్ అన్నారు. ఉపాధి హామీ చట్టం ద్వారా జనరేట్ అయిన మెటీరియల్ కాంపోనెంట్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. సోమవారం స్థానిక ఐటిడిఎ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆయన పనుల పురోగతిపై అధికారులతో చర్చించారు. రైతు భరోసా కేంద్రాలు, సచివాలయ భవనాలు, వెల్నెస్ సెంటర్ల పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. బిటి రోడ్డు పనులు ఎంత వరకు పూర్తి చేశారో తెలుసుకున్నారు. ప్రస్తుతం పనుల సీజన్ అని, వర్షాలు ప్రారంభం కాకుండా ముందుగానే పూర్తి చేయాలని ఆయన సూచించారు. సమావేశంలో జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి డాక్టర్ ఎంవిఆర్ కృష్ణాజీ, ఉప కార్యనిర్వాహక ఇంజినీర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డిఇఒ ప్రేమ్‌కుమార్

## పిల్లలను ఇబ్బంది పెడితే సహించేది లేదు : డిఇఒ

ప్రజాశక్తి - వీరఘట్టం

పిల్లలకు భోజనాలు విషయంలో ఇబ్బంది పెడితే సహించేది లేదని డిఇఒ ఎస్.ప్రేమ్ కుమార్ సిబ్బందిని హెచ్చరించారు. మండలంలోని కంబరవలస జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డిఇఒ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన ఆహారం ఇస్తున్నారాలేదానని, వంటలను పర్యవేక్షించాలని ప్రధానోపాధ్యాయులు వి.భాస్కరరావును ఆదేశించారు. పిల్లలకు పెట్టే భోజనం రుచికరంగా ఉండేలా చూడాలన్నారు. భోజనాలు విషయంలో తేడా వస్తే సహించేది లేదని హెచ్చరించారు. నైట్ వాచ్మెన్ పోస్ట్‌కు సంబంధించి గత కొద్దిరోజుల నుండి ఏర్పడుతున్న గందరగోళానికి తెరదించేందుకు 15 రోజులు వ్యవధిలో ప్రభుత్వ నిబంధన మేరకు నియామకం జరుపుతామని స్పష్టం చేశారు. పాఠశాలలో ఎటువంటి సమస్య లేకుండా చూసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. అలాగే పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులు వేగవంతం చేయాలని సూచించారు. పాఠ్యపుస్తకాల విషయంలో తేడాలుంటే తమ దృష్టి తీసుకురావాలని సిబ్బందిని ఆదేశించారు. అక్కడి నుండి వీరఘట్టంలోని జిల్లా పరిషత్ బాలుర ,బాలికలు ఉన్నత పాఠశాలను సందర్శించి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్ సుంభరో అందుబాటులో లేకపోవడంతో షోకాజ్ నోటీస్ జారీ చేశారు. విధి నిర్వహణ అలసత్వం వహిస్తే సహించేది లేదని సిబ్బందిని హెచ్చరించారు శత శాతం విద్యార్థులు పాఠశాలకు హాజరయ్యేలా దృష్టి పెట్టాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం సిబ్బంది, విద్యార్థుల హాజరు పట్టికలు పరిశీలించారు. డిఇఒ వెంట సర్పంచ్ మరడాన లక్ష్మి -కేశవరావు, పాఠశాల పేరెంట్ కమిటీ చైర్మన్ బలరాం, సిబ్బంది పాల్గొన్నారు.

## ఉపాధి సిబ్బందిని క్రమబద్ధీకరించాలి

ప్రజాశక్తి - సీతంపేట

ఉపాధి హామీ సిబ్బందిని క్రమబద్ధీకరించాలని ఐటిడిఎ పిఒకు వినతిని సమర్పించారు. సోమవారం స్థానిక ఐటిడిఎలో జరిగిన స్పందన కార్యక్రమం పిఒ కల్పనా కుమారికి వినతిని అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఉపాధి సిబ్బందిని క్రమబద్ధీకరణ చేస్తానని ఎన్నికల ముందు హామీ ఇచ్చారని, ఆ హామీ ప్రకారం క్రమబద్ధీకరణ చేయాలని ఎపిఒలు బాబురావు, సింహాచలం, రమణ వినతులు సమర్పించారు. సవర భాష వాలంటీర్లను రెన్యువల్ చేయాలని ఆ సంఘం నాయకులు డుంబు తదితరులు విన్నవించారు. ఇర్రపాడు గ్రామానికి చెందిన కృష్ణ రెవెన్యూ పట్టా ఇప్పించాలని కోరారు. ఉయ్యాల గూడకు చెందిన సవర సింహాచలం కోళ్లఫారం షెడ్డు మంజూరు చేయాలని, భవానీపురానికి చెందిన మహాలక్ష్మి హౌసింగ్ బిల్లు చెల్లించాలని కోరారు. బెట్టుపురం గ్రామానికి చెందిన సింహాచలం మేకల్లోనూ ఇప్పించాలని కోరారు. మొగడపేట చెందిన భారతి దుక్కు మిషన్ మంజూరు చేయాలని విన్నవించారు. ఎగువ నల్లబొంతుకు చెందిన చిట్టిబాబు నాయుడు బిటి రోడ్డు మంజూరు చేయాలని కోరారు. స్పందన కార్యక్రమానికి 80 వినతులు వచ్చాయి. కార్యక్రమంలో ఎపిఒ రోషి రెడ్డి ట్రైబల్ వెల్ఫేర్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.సింహాచలం డిప్యూటీ డిఎంహెచ్ఒ కె.విజయ పార్వతి, డిప్యూటీ డిఇఒ ఎ.లిల్లీరాణి, జిసిసి డిఎం సంధ్యారాణి, సిడిపిఒ పి.రంగలక్ష్మి, ఎడి తిరుమలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఐటిడిఎ పిఒ కల్పనాకుమారికి వినతిని అందజేస్తున్న ఉపాధిహామీ సిబ్బంది

## నేతన్న నేస్తంకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి - కలెక్టరేట్

వైఎస్ఆర్. నేతన్న నేస్తం పథకానికి దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా చేనేత, జౌళి శాఖ అధికారి ఐ.ధర్మారావు అన్నారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సొంత మగ్గం ఉన్న చేనేత కార్మికునికి వైఎస్ఆర్ నేతన్న నేస్తం పథకం కింద ఏడాదికి రూ.24వేలు ఆర్థిక సహాయం అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ పథకంలో కొత్తగా చేరడానికి ఈనెల 20లోగా గ్రామ, వార్డు సచివాలయాల్లో తమ పేరు నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. ఈనెల 28 నుండి 29 వరకు గ్రామ, వార్డు సచివాలయాల్లో అర్హులైన లబ్దిదారుల వివరాలను ప్రదర్శిస్తామని, లబ్ధిదారులు వాటిని గమనించాలని ఆయన పేర్కొన్నారు. అర్హులైన చేనేత కార్మికులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. స్వంత మగ్గం ఉండాలని, కుటుంబానికి ఒక్క చేనేత మగ్గమునకు మాత్రమే ఆర్థిక సహాయం లభిస్తుందనిస్పష్టం చేశారు. దారిద్ర్య రేఖకు దిగువనఉన్న చేనేత కార్మికులు మాత్రమే ఆర్థిక సహాయానికి అర్హులని పేర్కొన్నారు. ప్రాథమిక చేనేత సంఘాలు, మాస్టర్ వీవర్ల షెడ్లలో పనిచేస్తున్న చేనేత కార్మికులు, చేనేత అనుబంధ వృత్తుల్లో పనిచేసే కార్మికులు ఈ పథకానికి అనర్హులని వివరించారు.

## బాల సాహితీ రచయితకు కలెక్టర్ అభినందన

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

మండలంలోని నర్సిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న బివి పట్నాయక్ రచనలపై ఆంధ్రా యూనివర్సిటీ పరిశోధక విద్యార్థి బోను బాలకృష్ణ చేసిన పరిశోధనకు డాక్టరేట్ లభించింది. ఈ సందర్భంగా ఆంధ్ర యూనివర్సిటీ ధ్రువీకరించిన ఈ పరిశోధనా గ్రంథాన్ని కలెక్టర్ నిశాంత్‌కుమార్ బహూకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిల్లల్లో నైతిక విలువలు పెంపొందించేందుకు బాలసాహిత్యం అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో డిఇఒ ఎన్.ప్రేమకుమార్, ఎపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.బాలకష్ణ, పూర్వ అధ్యక్షులు బెహరా గుంపస్వామి, సంతోష్ కుమార్, బాల రచయిత్రి మోక్షజ తదితరులు పాల్గొన్నారు. నర్సిపురం ఉన్నత పాఠశాల సిబ్బంది, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత బెలగాం భీమేశ్వరరావు, తోటి రచయితలు .పట్నాయక్ ను అభినందించారు.

పట్నాయక్‌కు గ్రంథాన్ని బహూకరిస్తున్న కలెక్టర్

రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

## రోడ్డు పనులు ప్రారంభం

**ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్**

మండలంలోని గోచెక్క పంచాయతీ లిడికివలసలో ఆర్అండ్‌బి రోడ్డు నుంచి గ్రామం వరకు రూ.1.26 లక్షలతో 2కిలోమీటర్ల తారు రోడ్డు పనులను స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపిపి శోభారాణి, జెడ్‌పిటిసి బగల రేవతమ్మ, సర్పంచ్ ఉదయాన శకుంతల, సన్యాసినాయుడు, వాటక ఎర్రప్ప, సీదరపు ఎర్రప్ప, తాడంగి దిబ్బన్న, శంబంగి జగదీష్, ఎంపిటిసి వాటక సత్యవతి, వైసిపి నాయకులు బొమ్మి రమేష్, మహాపాత్రు గణేష్, వాటక సుందరరావు, చీదరపు సూరయ్య, భీమవరపు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

**ప్రజాశక్తి - కలెక్టరేట్**

మున్సిపల్ రంగంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతిని అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లె వెంకటరమణ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల్ని పర్మినెంట్ చేస్తామని అసెంబ్లీ సాక్షిగా జగన్మోహన్ రెడ్డి చెప్పారని నేటికి నాలుగేళ్లు కావస్తున్నా మున్సిపల్ కార్మిక సమస్యల పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉందని, తక్షణమే మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కాంటాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగం పర్మనెంట్ చేయాలని, సంక్షేమ పథకాలు వర్తింపు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మిక ప్రతినిధులు, ఎన్.నిర్మల, డి.ఈశ్వరరావు, వి.అప్పలరాజు పాల్గొన్నారు.

## 113 మందికి నేత్ర పరీక్షలు

**ప్రజాశక్తి - వీరఘట్టం**

స్థానిక సత్యసాయి మందిర ఆవరణలో సోమవారం నేత్ర వైద్య శిబిరంలో విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ ఆప్తాల్మిక అధికారి ఎస్.జాక్సన్ ఎస్ 113 మందికి తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఇందులో భాగంగా 52మందిని ఎంపిక చేసి శస్త్ర చికిత్సల కొరకు విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రికి తరలించారు. శ్రీకాకుళం జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో క్యాంపు కోఆర్డినేటర్ సిహెచ్ వెంకటరమణ, పిఎంఒ దుర్గారావు, ఆలయ కన్వీనర్ వి.విశ్వప్రసాద్, కె.సన్యాసినాయుడు, జి.మురళీకృష్ణ, పి.హరిబాబు, వరనరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

## భూమిని అప్పగించాలి

**ప్రజాశక్తి - వీరఘట్టం**

తమ భూమిని అప్పగించాలని మండలంలోని సంత నర్సిపురానికి చెందిన మహిళలు సోమవారం స్థానిక తహాశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో ఫిర్యాదు చేశారు. 2008లో అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి రెండో విడత భూపంపిణీ కార్యక్రమంలో తనకు 1.51 ఎకరాలు భూమిని పంపిణీ చేశారన్నారు. అయితే తన భూమి తనకు అప్పగించాలని పలు దఫాలు తహాశీల్దార్ కార్యాలయం ఎదుట వంటావార్పు, ధర్నాలు ఆందోళన కార్యక్రమాలు చేపట్టి తఅప్పగించలేదని అన్నారు. పట్టాదారు పాస్ పుస్తకాలు ఇచ్చిన అధికారులు తమ భూమి ఎక్కడుందో అది కూడా అప్పగించాలని మహిళలు వేడుకున్నారు. దీనిపై స్పందించి స్థానిక తహాశీల్దార్ చందక సత్యనారాయణ, రెండు నెలల్లో సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

## వైసిపి ప్రజాప్రతినిధులకు శిక్షణ

**ప్రజాశక్తి - సాలూరు**

నియోజకవర్గ పరిధిలోని వైసిపి మున్సిపల్ కౌన్సిలర్లు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులకు సోమవారం స్థానిక వైటిసిలో ఐ-ప్యాక్ బృందం శిక్షణ ఇచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, గత ప్రభుత్వం హయాంలో అమలైన పథకాల గురించి వివరిస్తూ అవగాహన కల్పించారు. రానున్న ఎన్నికల నేపథ్యంలో ప్రచారం నిమిత్తం ప్రజల్లోకి వెళ్లనున్న స్థానిక ప్రజాప్రతినిధులకు సంక్షేమ పథకాలపై కనీస అవగాహన అవసరమని భావించి వైసిపి అధిష్టానం శిక్షణ కార్యక్రమం నిర్వహించింది. సాలూరు మున్సిపల్ కౌన్సిలర్లు, ఎంపిటిసిలు, పాచిపెంట, మక్కువ మండలాలకు చెందిన ప్రజాప్రతినిధులు ఒక పూట శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు.

## చేతి వృత్తుల వారికి ఆర్థిక సాయం అందించాలి

**ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం**

తరతరాల నుంచి చేతి వృత్తులపై ఆధారపడి జీవనం సాగిస్తున్న కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం బిసి కార్పొరేషన్ ద్వారా రూ.1,50,000 ఆర్థిక సాయం అందించాలని విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షులు కె గౌరీశ్వరరావు కోరారు. వడ్రంగి, బంగారపు పని, ఇత్తడి పని, కమ్మరి, శిల్పి పనులవారు కులవృత్తిని ఆధారంగా చేసుకుని జీవనం సాగిస్తున్న ప్రభుత్వం నుంచి ఎటువంటి సాయం అందకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్ విశ్వబ్రాహ్మణులకు ఆర్థిక సాయం చేసిన మాదిరిగానే ఆంధ్రప్రదేశ్ లో కూడా ఆర్థిక సాయం చేసి కుటుంబాలను ఆదుకోవాలని కోరారు.

## పిటిజి బాలికల పాఠశాల ప్రిన్సిపల్‌గా సుబ్రహ్మణ్యం

**ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం**

మండలంలోని భద్రగిరి ఎపి గిరిజన గురుకుల బాలికల పాఠశాల ప్రిన్సిపల్‌గా ఎన్.సుబ్రహ్మణ్యం సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు గిరిజన గురుకుల బాలుర పాఠశాల ప్రిన్సిపల్‌గా పనిచేస్తూ బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు పాఠశాల సిబ్బంది పుష్పగుచ్చాన్ని ఇచ్చి ఆహ్వానం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తాను భద్రగిరి గిరిజన గురుకుల బాలికల పాఠశాలను అభివృద్ధి పథంలో తీర్చిదిద్దేందుకు శ్రమిస్తానన్నారు. పాఠశాల సిబ్బంది సూచనల మేరకు పాఠశాలను మరింత అభివద్ధి పథంలో నడిపించేందుకు కషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్చార్జి ప్రిన్సిపల్ ఎం. కమల కుమారి, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది ఉన్నారు.

## సిఆర్‌టిలను రెన్యువల్ చేయాలి

**ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం**

ఐటిడిఎ పరిధిలో పనిచేస్తున్న సిఆర్‌టిలను రెన్యువల్ చేసి విధుల్లోకి తీసుకోవాలని టిడిపి సీనియర్ నాయకులు నందివాడ కృష్ణబాబు అన్నారు. గుమ్మలక్ష్మీపురంలో ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. 2014 ముందు ఐదేళ్ల సర్వీస్ పూర్తి చేసిన సిఆర్‌టిలను మాత్రమే రెన్యువల్ చేస్తామని ప్రభుత్వం చెప్పడం అన్యాయం అన్నారు. ఈ నిబంధనను సవరించి అందర్నీ విధుల్లోకి తీసుకొని ఏజెన్సీలో విద్యాభివృద్ధికి కృషి చేయాలని కోరారు. మరోవైపు ఆశ్రమ పాఠశాలల్లో ఎన్ఎం పోస్టులు లేకపోవడంతో విద్యార్థులకు వైద్య సేవలు అందడం లేదని అన్నారు. ఆశ్రమ పాఠశాలల్లో ఎఎన్ఎం పోస్టులను భర్తీ చేసి అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాలని కోరారు. విద్యార్థులకు కాస్మెటిక్ చార్జీలు చెల్లించాలని అన్నారు.

## విత్తన నమోదు పరిశీలన

**ప్రజాశక్తి - పాచిపెంట**

రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు కావాల్సిన వరి విత్తనాలు ఉన్నాయని, కావాల్సిన రైతులు వెంటనే నమోదు చేయించుకోవాలని, రెండు, మూడు రోజుల్లో అన్ని రైతు భరోసా కేంద్రాల్లో విత్తనం రిజిస్ట్రేషన్లు పూర్తి చేయాలని వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు అన్నారు పాంచాలి, విశ్వనాథపురం ఆర్‌బికెలను పరిశీలించారు. విత్తనాలు పరీక్షించిన తర్వాతే రైతులకు అందజేస్తామన్నారు. అనంతరం ఘనజీవామృతం తయారీ విధానాన్ని రైతులకు వివరించారు. కార్యక్రమంలో విఎఎ శ్రీను, మోహన్, ఎపిసిఎన్ ఎఫ్ మెంటర్ రమణమ్మ, రైతులు పాల్గొన్నారు.

## ములగలో విత్తనాలు పంపిణీ

**ప్రజాశక్తి- పార్వతీపురంరూరల్**

మండలంలోని ములగ ఆర్‌బికె పరిధిలో గల రైతులకు సర్పంచ్ మడక కష్ణవేణి సోమవారం విత్తనాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయం పంచాయతీ కార్యదర్శి పకీరు, ఉద్యాన సహాయకులు రేణుక, వార్డు సభ్యులు రైతులు హాజరయ్యారు.

# విద్యార్థులకు జగనన్న కిట్లు పంపిణీ

**ప్రజాశక్తి - పాలకొండ రూరల్**

మండలంలోని చిన్న మంగళాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం జగనన్న విద్యా కానుకలను సర్పంచి గోగుల జ్యోతి విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జామి రవి, ఉపాధ్యాయులు గారాల సూర్యం, లాభాల ఉమామహేశ్వరరావు, రైతు గౌరీ శంకర్రావు, చొంగ వెంకటరావు, జీవరత్నం, వెలగాడ భాస్కరరావు, బడే సింహాచలం, శ్రీనివాసరావు, అనిల్, గణపతిరావు, శంకర్, సి ఆర్ పి మజ్జి గౌరీ, విద్యా కమిటీ చైర్మన్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. అలాగే పాలకొండ పట్టణంలోని వెంకంపేట వీధి ఎంపియుపి పాఠశాలలో జగనన్న విద్యాకానుక కిట్లను పంపిణీ చేశారు. ప్రభుత్వం సరఫరా చేసిన నోట్ పుస్తకాలు, యూనిఫాం, షూలను విద్యార్థులకు అందించామని హెచ్ ఎం జి.పరాంకుశంనాయుడు తెలిపారు. కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఊల స్వాతి, కనకం వెంకట రమణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**కురుపాం :** జగనన్న విద్యా కానుక కిట్లు పేద, మధ్యతరగతి విద్యార్థులకు వరమని ఎంపిపి శెట్టి పద్మావతి అన్నారు. సోమవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు టి.శంకరరావు ఆధ్వర్యంలో జరిగిన జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆమె హాజరై విద్యార్థులకు కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ ఎన్.సత్యనారాయణ, జెడ్‌పిటిసి జి.సుజాత, మేజర్ పంచాయతీ సర్పంచ్ జి.సుజాత, కళింగ వైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కె.సురేష్ కుమార్, ఎంపిటిసిలు టివిఎస్ స్వామియోజులు, జి.సంతోషిని, సిఆర్పి నరేష్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

**సాలూరు:** మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో సోమవారం విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేశారు.పట్టణంలోని బంగారమ్మ కాలనీలో ఉన్న మున్సిపల్ ఎలిమెంటరీ పాఠశాల లో స్థానిక కౌన్సిలర్ పి.మధుసూధనరావు విద్యార్థులకు బ్యాగులు, యూనిఫాం బట్టలు,చెప్పులను అందజేశారు. బంగారమ్మ పేటలో మున్సిపల్ యుపి పాఠశాలలో విద్యార్థుల కు కౌన్సిలర్ సింగారపు ఈశ్వరరావు బ్యాగులు, యూనిఫాం బట్టలు, చెప్పులు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో పాఠశాల హెచ్ ఎం ఆర్.రజనీకాంత్ వున్నారు.

**జియమ్మ వలస :** జగనన్న విద్యా కానుక కిట్లను చినమేరంగి జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్థానిక ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఉపాధ్యాయులు పాల్గొన్నారు

**మక్కువ:** స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లనువిద్యార్థులకు జెడ్పిటిసి మావుడి శ్రీనివాసరావు అందజేశారు ములక్యాయ వలస మోడల్ పాఠశాలలో కూడా ప్రిన్సిపల్ స్వర్ణలత ఆధ్వర్యంలో విద్యార్థులకు జగనన్న విద్యా కానుక చెట్లను కూడా అందజేశారు ఈ కార్యక్రమంలో ఎంఈఓ మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

విద్యార్థినికి జెవికె కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

విద్యార్థులకు జెవికె కిట్లు పంపిణీ చేస్తున్న కురుపాం ఎంపిపి

విద్యార్థినికి జెవికె కిట్లు పంపిణీ చేస్తున్న మక్కువ జెడ్‌పిటిసి

పాలకొండ : విద్యార్థులకు కిట్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్

## 14న ఆర్మీ ఉచిత శిక్షణ ప్రారంభం

**ప్రజాశక్తి - పార్వతీపురం**

ఆర్మీ ఉచిత శిక్షణా కార్యక్రమం ఈ నెల 14న ప్రారంభమవుతుందని సెట్విజ్ సిఇఒ బి.రామగోపాల్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. విజయనగరం రాజీవ్ స్టేడియంలో రెసిడెన్షియల్ శిక్షణ కొనసాగుతుందని ఆయన చెప్పారు. పార్వతీపురం మన్యం జిల్లా అభ్యర్థులు ఇందులో పాల్గొన వచ్చని ఆయన పేర్కొన్నారు. అగ్నిపథ్ పథకం అగ్నివీర్ (ఆర్మీ), అగ్నివీర్ వాయు (ఎయిర్ ఫోర్సు), అగ్నివీర్ (నేవీ)లో నియామకములకు సంబంధించి అర్హులైన యువతీ, యువకులకు రాజీవ్ స్పోర్ట్స్ స్టేడియంలో 40 రోజులు ఉచిత రెసిడెన్షియల్ ఆర్మీ రిక్రూట్మెంట్ శిక్షణ ఇవ్వడం జరుగుతుందని ఆయన వివరించారు. 2023-24 ఆర్థిక సంవత్సరమునకు అగ్నిపథ్ పథకంలో భాగంగా అగ్నివీర్ (ఆర్మ) రిక్రూట్మెంట్ ర్యాలీ విజయనగరం జిల్లాలో జూలై 20 నుండి ఆగస్ట్ 2 వరకు పోలీస్ ట్రైనింగ్ కళాశాల ఆవరణలో జరుగుతుందని ఆయన అన్నారు. ఈ పథకంలో భాగంగా విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలలో అర్హులైన యువతీ, యువకులకు 40 రోజులు రాజీవ్ స్పోర్ట్స్ స్టేడియం ఉచిత రెసిడెన్షియల్ ఆర్మీ రిక్రూట్మెంట్ శిక్షణ ఇచ్చేందుకు సెట్విజ్, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ నిర్ణయించినట్లు తెలిపారు. కావున అర్హత గల అభ్యర్థులు ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ఆసుపత్రి వ్యర్థాలపై ప్రత్యేక చర్యలు చేపట్టాలి

**ప్రజాశక్తి - పాలకొండ**

ఆసుపత్రి వ్యర్థాలపై (బయో మెడికల్ వేస్ట్ మేనేజ్మెంట్) ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బగాది జగన్నాథరావు అన్నారు. పాలకొండలో విజయ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిని సోమవారం ఆయన తనిఖీ చేశారు. ఆసుపత్రి వ్యర్థాల యాజమాన్యంను పరిశీలించిన డిఎంహెచ్ఒ ప్రభుత్వ నిబంధనల మేరకు వ్యర్థాల విసర్జన (డిస్పోజ్) జరగాలని ఆదేశించారు. వ్యర్థాల విసర్జనలో అలసత్వం వహించరాదని చెప్పారు. బయో మెడికల్ వేస్ట్ మేనేజ్మెంట్ వివరాలను తప్పనిసరిగా రికార్డ్ నిర్వహించాలని ఆయన సూచించారు. అన్ని ప్రైవేట్ హాస్పిటల్స్ లో ఐహెచ్ఐపి ద్వారా పి.ఫార్మ్, ఎల్ ఫార్మ్ లలో రోజు నమోదు అవుతున్న జ్వరాలు, తదితర వ్యాధుల వివరాలు తప్పకుండా ఆన్లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. అన్ని కేసుల్ని నోటిఫై చేయాలని అన్నారు. హాస్పిటల్‌లో ధరల పట్టిక ఉండాలని ఆయన ఆదేశించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తులతో మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ సేవలపై ఆరా తీశారు. చికిత్సకు వచ్చే వారికి చక్కటి వైద్యం అందించాలని ఆదేశించారు. ఆసుపత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని, ముఖ్యంగా మరుగుదొడ్ల నిర్వహణపై దృష్టి సారించాలని అన్నారు. ప్రజలకు మంచి వైద్య సేవలు అందించడం వైద్యుల ప్రధాన అభిమతం కావాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఎపిడమాలజిస్ట్ డా. నవీన్ కుమార్, ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం జిల్లా నోడల్ అధికారి డా. వినోద్ కుమార్, డెమో వై. యోగేశ్వర రెడ్డి, ఆసుపత్రి ఆర్ఎంఒ డాక్టర్ సాయి శంకర్, మేనేజర్ ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన సమస్యలు పరిష్కరించాలి

**ప్రజాశక్తి - కలెక్టరేట్**

పాచిపెంట మండలం కోటికి పెంట పంచాయితీ ఒడిసెలమడ గిరిజన గ్రామానికి రహదారి నిర్మాణం చేపట్టాలని, తాతల కాలం నుంచి సాగు చేస్తున్న అటవీ పోడు భూములకు పట్టాలు మంజూరు చేయాలని గిరిజన సంఘం ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఎపి గిరిజన సంఘం నాయకులు సొయ్యారి వెంకన్న, సేబి, అమ్మన్న, తామల సింహాచలం ఆధ్వర్యంలో చర్చి సెంటర్ నుండికలెక్టర్ ఆఫీస్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రెడ్డి వేణు మాట్లాడుతూ తాతలు కాలం నుంచి సాగు చేస్తున్న అటవీ పోడు భూములకు నేటికీ పట్టాలు అందించకపోవడం అధికారుల నిర్లక్ష్యం, దుర్మార్గమని అన్నారు. 2005లో వచ్చిన అటవీ హక్కుల చట్టాన్ని నిర్వీర్యం చేయకుండా అధికారులు యుద్ధ ప్రాతిపదికన గిరిజనులకు అటవీ పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఈ గ్రామానికి రోడ్డు లేకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు .ఎప్పటికైనా అటవీ పట్టాలు, రోడ్లు వెంటనే పరిష్కారమయ్యేలా అధికారులు చర్యలు చేపట్టాలని అన్నారు. సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ సమస్యలు వెంటనే పరిష్కరించకపోతే తహాశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సోయారి దాసు ,కన్నయ్య, సేబిలక్ష్మి ,ఎస్ రాములమ్మ , కొత్తమ్మ ,సొయ్యారి సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌కు ర్యాలీగా వెళ్తున్న గిరిజనులు

# సెలవుల్లో ఏం చేశారు..?

## సిబ్బందిని ప్రశ్నించిన డిప్యూటీ డిఇఒ

**ప్రజాశక్తి - వీరఘట్టం**

ఒక అడ్మిషన్ కూడా చేయలేదా? సెలవుల్లో ఏం చేశారు? క్యాంపెన్ నిర్వహించలేదా? అంటూ డిప్యూటీ డిఇఒ ఆర్.విజయకుమారి సిబ్బందిపై ఆగ్రహ వ్యక్తం చేశారు. మండలంలోని కంబరవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సోమవారం ఆమె సందర్శించారు. సెలవులకు ముందు, పున: ప్రారంభానికి ప్రస్తుతం విద్యార్థుల సంఖ్య ఎంత అని సిబ్బందిని ప్రశ్నించగా 101 మంది విద్యార్థులేనని తెలిపారు. ఈ సెలవుల్లో ఒక్క అడ్మిషన్ నమోదు చేయకపోవడంపట్ల ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. నాడు-నేడు పనులు కూడా పూర్తికాలేదని 50 రోజుల కిందట చూసినప్పుడు ఇలాగే ఉన్నాయని, ఇప్పుడు కూడా పనుల్లో మార్పు రాలేదని అన్నారు. పాఠశాల ఆవరణలోనే వంట గదిని పరిశీలించి ఈరోజు విద్యార్థులకు మెనూ ఏం పెడుతున్నారని నిర్వాహకులను అడగ్గా సమాధానం రాలేదు. వంటశాల వద్ద మెనూ చార్ట్ ఏర్పాటు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. పాఠశాల ఆవరణలో విద్యార్థులకు నీటి సౌకర్యం కోసం ఏర్పాటు చేసిన పైపులను ఎవరో గుర్తు తెలియని వ్యక్తులుకోసినట్లు గుర్తించారు. అనంతరం విద్యార్థులకు జగనన్న విద్యా కిట్లను పంపిణీ చేశారు. వీరఘట్టం జిల్లా పరిషత్ బాలికల, బాలుర ఉన్నత పాఠశాలలు సందర్శించారు. జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలను సందర్శించి ఎంతమంది విద్యార్థులు పాఠశాలకు హాజరు కావాల్సి ఉందని డిప్యూటీ డిఇఒ సిబ్బందిని ప్రశ్నించగా 234 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉన్నప్పటికీ 14 మంది విద్యార్థుల హాజరైనట్లు సిబ్బంది వివరణ ఇచ్చారు. శత శాతం విద్యార్థులు పాఠశాలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం జగనన్న విద్యా కిట్లను విద్యార్థులకు పంపిణీ చేశారు. అలాగే మండల వ్యాప్తంగా జగనన్న విద్యా కిట్లను ప్రజా ప్రతినిధులు ద్వారా పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచి మరడాన లక్ష్మీ -కేశవరావు , ప్రధానోపాధ్యాయులు వి భాస్కరరావు ఎస్ సుంద్రో, ఉపాధ్య సిబ్బంది, విద్యార్థులు ,పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూమి ఆక్రమణదారుపై చర్యలు తీసుకోవాలి

**ప్రజాశక్తి - కొమరాడ**

మండల కేంద్రంలో ప్రభుత్వ భూమి ఆక్రమిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కొమరాడకు చెందిన పెద్దలు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సిహెచ్ రాధాకృష్ణకు వినతిని అందజేశారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపాన గల ప్రభుత్వ భూమిని గ్రామానికి చెందిన జనార్ధన్ కబ్జా చేస్తున్నట్లు తెలి పారు. అలాగే అంతర్ రాష్ట్ర రహదారి పక్కనే గల గెడ్డను ఆక్రమించి మట్టి కప్పే శారని తెలిపారు. ఇప్పటికే ఈ కబ్జాలపై ఫిర్యాదు చేశామని, అయినా అక్కడ నిర్మాణ పనులు జరుగుతున్నాయని తెలిపారు. తక్షణమే రెవెన్యూ అధికారులు స్పందించి కబ్జాలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవా లని కోరారు. ప్రభుత్వ భూములు, గెడ్డలు ఆక్రమిస్తున్న వారిపై క్రిమినల్ కేసులు పెట్టి ప్రభుత్వ ఆస్తులను కాపాడాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో టిడిపి నాయకులు, జిల్లా మాజీ వైస్ చైర్మన్ గుల్లిపల్లి సుదర్శన్ రావు, కొమరాడ కోపరేటివ్ ప్రెసిడెంట్ మరడాన సూరపునాయుడు, వైసిపి సీనియర్ నాయకులు మరడాన సింహా చలం నాయుడు, పల్లి నగేష్, సిరికి సింహాచలం, సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి, టిడిపి కొమరాడ మండల నాయకులు మరడాన వెంకటనాయుడు జనసేన, చినఖేర్చల సర్పంచు బి.గంగాధర్, కళింగ వైశ్య జిల్లా నాయకులు వడ్డీ గాంధీ, కొమరాడ బీసీ కాలనీకి చెందిన మరడాన త్రినాథ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## నడుకూరులో ఫ్యామిలీ డాక్టర్

**ప్రజాశక్తి - వీరఘట్టం**

మండలంలోని నడుకూరులో సోమవారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి వివిధ రకాలైన రోగులకు తనిఖీ చేసి మందులు పంపిణీ చేశారు. అలాగే మంచాన పట్టిన రోగుల ఇళ్లకు వెళ్లి మందులు పంపిణీ చేశారు. అనంతరం అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించి గర్భిణీలకు, చంటి పిల్లలకు పౌష్టికాహారాన్ని అందించాలని అంగన్వాడీ కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో సూపర్వైజర్ ఒ.శాంతకుమారి, ఎఎన్ఎం సరస్వతి, టెక్నీషియన్, ఎంఎల్ హెచ్‌పి, ఆశ కార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

**సీతానగరం:** మండలంలోని ఆర్.వెంకంపేటలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని వైద్యాధికారి డాక్టర్ పి.ఉషారాణి ఆధ్వర్యంలో నిర్వహించారు. గర్భిణులకు వైద్య పరీక్షలు చేసి హీమోగ్లబిన్ తక్కువ ఉన్నవారి ఆరోగ్య పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకొని వారికి కావాల్సిన ఐరన్, కాల్షియం మల్టీవిటమిన్ టాబ్లెట్స్ ఇవ్వాలని సూచించారు. వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులుతో బాధపడుతున్న వారు, షుగర్. బిపి ఆస్తమా ఫిట్స్ మొదలైన వ్యాధులతో బాధపడుతున్న వారికి వైద్యం అందించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సింహాచలం, వైద్య సిబ్బంది, 104 సిబ్బంది దుర్గాప్రసాద్, ప్రసాద్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎండల తీవ్రత పట్ల అప్రమత్తంగా ఉండాలి

**ప్రజాశక్తి - కలెక్టరేట్**

ఎండల తీవ్రత పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్య అధికారులు, సిబ్బందికి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బగాది.జగన్నాథరావు సూచించారు. జిల్లా పరిధిలో గల ఐదు అర్బన్ హెల్త్ సెంటర్ల వైద్యాధికారులు, సిబ్బందితో సోమవారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున ప్రజలందర్నీ తగిన ముందుజాగ్రత్త చర్యలు తీసుకునేలా అప్రమత్తం చేయాలన్నారు. అత్యవసర సమయంలో బయటకు పనికి వెళ్లే వారు అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఉదయం 11 నుండి మధ్యాహ్నం 3 వరకు ఎండ తీవ్రత ఎక్కువ ఉండే సూచనలు ఉన్నందున ఆ సమయంలో సాధ్యమైనంత వరకు బయటకు రాకుండా ఉండడం మంచిదన్నారు. ఎవరికైనా వడదెబ్బ తగిలి మూర్ఛపోయినా, ఏమైనా అత్యవసరమైన పరిస్థితుల్లో దగ్గర్లో ఉన్న పట్టణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లను సందర్శించి తగిన చికిత్స తీసుకోవాలని సూచించారు. వీటిపై ప్రజల్లో అవగాహన కల్పించాలని ఆయన ఆదేశించారు. అలాగే వర్షాకాలం సమీపిస్తున్నందున జ్వరాలు పెరిగే అవకాశం ఉందని, వాటిపైన అవగాహన అవసరం అన్నారు. ప్రతీ ఆరోగ్య కేంద్రం పరిధిలో ఎన్.సి.డి, సి.డి సర్వే తప్పనిసరిగా చేయాలని అందులో ప్రగతి కనపరచాలని ఆదేశించారు.

## సర్పంచుల సమస్యలు పరిష్కరించాలి

**ప్రజాశక్తి - సీతానగరం**

సర్పంచుల సమస్యలు పరిష్కరించాలని ఆసంఘం నాయకులు జి.అన్నంనాయుడు ఎన్.రామకృష్ణ, ఎం.తనూజనాయుడు ఎంపిడిఒ ఎంఎస్ఎల్ ప్రసాద్‌కు సోమవారం వినతిపత్రం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధులు గ్రామాల అభివృద్ధికి ఉపయోగించుదామంటే, వచ్చిన నిధులే సక్రంగా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అందులోనే హరితరాయిబారులకు జీతాలు చెల్లించమంటే కష్టతరమన్నారు. మొదట్లో స్వచ్ఛభారత్ ద్వారా వారికి జీతాలు చెల్లించే వారిని, అలాగే వారికి జీతాలు చెల్లించేలా చర్యలు చేపట్టాలని కోరారు. చేసిన పనులకు బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచులు ఎ.తిరుపతిరావు, పి.తిరుపతిరావు, వి.పారినాయుడు, ఎ.నాగభూషణంతో పాటు పలు గ్రామాలకు చెందిన సర్పంచులు పాల్గొన్నారు.

## పాఠశాల ఆవరణలో పులి పాదముద్రల కలకలం

**ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్**

మండలంలోని డోకిశిల గిరిజన సంక్షేమ బాలుర వసతి గృహం, ఉన్నత పాఠశాల ఆవరణలో పులి పాదముద్రలు పోలి ఉండడంతో కలకలం రేపింది. సోమవారం ఉదయం పాఠశాల పునఃప్రారంభం కావడతో పాఠశాల తలుపులు తెరువుగా పులి పాదముద్రలు తోపాటు సంచారం చేసిన గుర్తులు కనిపించడంతో ప్రధానోపాధ్యాయులు గోవిందరావు అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. ఫారెస్ట్ అధికారులు పాఠశాలకు చేరుకొని పాదముద్రలు పరిశీలించి అవి పులికి సంబంధించినవి కావని తేల్చడంతో, ఊపిరి పీల్చుకున్నారు.

## పచ్చి రొట్ట విత్తనాలు పంపిణీ

**ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం**

మండలంలోని డుమ్మంగిలో గిరిజన రైతులకు 90 శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలను సర్పంచి పాలక క్రాంతి కుమార్ సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న పచ్చిరొట్ట విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే ఐటిడిఎ ద్వారా ప్రభుత్వం అందిస్తున్న వ్యవసాయ యాంత్రీకరణ పనిముట్లు కూడా కొనుగోలు చేసి వ్యవసాయంపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.

## అత్యవసర వైద్య సేవలు వినియోగించుకోండి

**ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్**

అత్యవసర వైద్య సేవ శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలని డిఐఒ టి.జగన్‌మోహన్‌రావు అన్నారు. జిల్లా ఆసుపత్రిలో గత కొద్దిరోజులుగా జరుగుతున్న అత్యవసర వైద్య సేవలపై జరుతున్న సిహెచ్ఒ (ఎంఎల్‌హెచ్‌పి)ల శిక్షణా తరగతుల కార్యక్రమంలో సోమవారం జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి(డిఐఒ) డాక్టర్ టి. జగన్మోహనరావు పాల్గొని పలు సూచనలు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లోనే సాధారణ వైద్యంతో పాటు అత్యవసర వైద్య సేవలు కూడా అందుబాటులో తెచ్చేందుకు వైద్య ఆరోగ్య శాఖ సూచనలు మేరకు ప్రారంభమైన శిక్షణా కార్యక్రమం బ్యాచ్ ల వారీగా కొనసాగుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోనే నమోదు అవుతున్న అత్యవసర వైద్యం, అవసరమైన అనారోగ్య సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ వహించి వైద్య సేవలందించాలని ఆయన సూచించారు. శిక్షణ శిబిరంలో ఎపిడిమియాలజిస్ట్ డాక్టర్ నవీన్ కుమార్, ప్రోగ్రాం అధికారి డాక్టర్ వినోద్ కుమార్, పలు వైద్య సేవలపై శిక్షణ ఇచ్చారు. నోడల్ ఆఫీసర్లు దుర్గా ప్రసాద్, తిరుపతిరావు, ట్రైనర్స్ నీలిమ, సంతోషి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## 'సంపద'పై స్పష్టత ఇవ్వాలి

### ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం డిమాండ్

**ప్రజాశక్తి- కలెక్టరేట్**

ఖరీఫ్ సీజన్లో రైతులు వ్యవసాయ పనులకు సిద్ధమవుతున్న నేపథ్యంలో సంపద వరి విత్తనాల పంపిణీపై స్పష్టత ఇవ్వాలని ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుడితి అప్పలనాయుడు డిమాండ్ చేశారు. ఒకవైపు రైతులు తమకు గిట్టుబాటు ధర కలిసివస్తుం దని, వాతావరణ పరిస్థితులను అధిగమిస్తూ అధిక దిగుబడి నిచ్చే సంపద రకం వరి సాగుకు సిద్ధమవుతున్న నేపథ్యంలో వ్యవసాయ శాఖ సబ్సిడీ లేకుండా పూర్తి రేటుకే అమ్మడం దారుణమన్నారు. ఇదే అదునుగా ప్రైవేటు వర్తకులు ఇతర జిల్లా నుంచి ఇక్కడికి వచ్చి ఎక్కువ ధరలకు విక్రయిస్తున్నారన్నారు. కావున వ్యవసాయాధికారులు దీనిపై స్పష్టత ఇవ్వాలని కోరారు.

## నేరాలు ఘోరాలు

### వడదెబ్బకు వ్యక్తి మృతి

**ప్రజాశక్తి - గరుగుబిల్లి**

మండలంలోని రావుపల్లిలో వడదెబ్బకు గురై వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. స్థానిక ఎస్ఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వంగర మండలం రాజులు గుమడకు చెందిన మిరియాల శంకర్త్ రావుపల్లికి మామిడి కాయలు కోయడానికి వచ్చాడు. మధ్యాహ్నం భోజన సమయంలో వడదెబ్బకు గురై మృతి చెందాడని అయన కుమారుడు పృథ్వి తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

### వ్యక్తి మృతి

**పాలకొండ :** మండలంలోని బాసూరు గ్రామానికి చెందిన చోడ అరుణకుమార్ (38) సోమవారం విశాఖ కెజిహెచ్‌లో మృతి చెందారు. గత నాలుగు క్రితంగ్రామంలోని పాఠశాలలో నాడు-నేడు పనుల్లో కూలీగా పనిచేశాడు. పని పూర్తయిన తర్వాత తిరిగి ఇంటికి వచ్చేందుకు పాఠశాల గోడ దూకాడు. అదుపు తప్పి కిందపడడంతో తలకు బలమైన గాయమైంది. దీంతో అతడ్ని శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం కెజిహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు.

### అత్తను గాయపర్చిన కోడలు

**ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్**

పట్టణంలోని రామాపురం కాలనీకి చెందిన గంధవరపు వనజాక్షి అనే మహిళపై సోమవారం ఆమె పెద్ద కోడలు హేమ, తన అన్నయ్య దివాకర్‌తో కలిసి దాడి చేసి గాయపరిచింది. బీమా, రేషన్ కార్డు విషయమై తలెత్తిన వివాదంలో అత్తా కోడళ్ల మధ్య జరిగిన తగాదాలో, కోడలు ఈ ఘటనకు పాల్పడినట్లు స్థానికులు తెలిపారు. గాయపడిన వనజాక్షిని జిల్లా ఆస్పత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఔట్‌పోస్టు పోలీసులు వివరాలను నమోదు చేశారు.